సాక్షి తిరుపతి

శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



వాహనదారులకు ఇం'ధనం'

వైఎస్సార్ వాహన మిత్ర పథకం వాహనదారులకు ఇం'ధనం'గా మారిందని మంత్రి ఆర్కే.రోజా తెలిపారు.

- 8లో



'ఆరోగ్య(ం)..సురక్షి'(తం)

రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా భావించి ఆ దిశగా అడుగులు వేస్తోంది.

- 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	33	24
చిత్తూరు	34	24
తిరుమల	29	21
గూడూరు	36	27
నగరి	35	25

న్యూస్‌రీల్

నేడు ఐఐటీలో 2కే రన్

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక రెవెన్యూలో ఉన్న ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో శనివారం 2కే రన్ జరుగుతుందని ఐఐటీ డైరెక్టర్ కేఎన్.సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. అలాగే ఆదివారం స్వచ్ఛత హీ సేవలో భాగంగా శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ ఆవరణలో విద్యార్థులతో శ్రమదానం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

సిరామిక్‌లో సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

గూడూరురూరల్: పట్టణంలోని ప్రభుత్వ సిరామిక్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ జారీచేసిందని ప్రిన్సిపల్ వీ.సత్యనారాయణ తెలిపారు. అక్టోబర్ 3న కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు జరుతాయన్నారు. పాలిసెట్ ఎంట్రన్స్ రాసి అర్హులై కౌన్సెలింగ్‌కు హాజరుకాని వారు, ఎంట్రన్స్‌లో క్వాలిఫై కానివారు, పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులందరూ అర్హులని తెలిపారు. వివరాలకు 9912342070, 8985348925 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు జాబ్‌మేళా

సూళ్లూరుపేట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శనివారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకరశర్మ తెలిపారు. శ్రీసిటీ సెజ్‌లోని ప్రముఖ బీఎంఎస్ సర్వీసెస్ కంపెనీ వారి ఆధ్వర్యంలో బ్లూస్టార్, హావెల్స్, పాసోనిక్ కంపెనీల్లో పనిచేసేందుకు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ చదివిన మహిళలు, పురుషులకు అవకాశం ఉందని తెలిపారు. నెలకు రూ.12 వేల నుంచి రూ.15 వేల దాకా ఉంటుందని, 18 సంవత్సరాలు పైబడి 35 సంవత్సరాల లోపు వారు అర్హులని చెప్పారు. అభ్యర్థులు ఒరిజినల్ మార్కులిస్టు, టీసీ, ఆధార్‌కార్డు, బ్యాంక్ బుక్, రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో పాటు అప్లికేషన్, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు తీసుకురావాలని ఆయన సూచించారు.



విరిగిన కాలును సరిచేస్తున్న డాక్టర్ ఎస్.కృష్ణమరాజు

శల్య వైద్యంలో.. రారాజు

- మాది తమిళనాడు రాష్ట్రం, తిరువళ్లూరు పట్టణం. నా పేరు వీ.బాబు. బాత్‌రూమ్‌లో జారిపడ్డాను. నా ఎడమ చేయి విరిగింది. పుత్తూరు కట్టు గురించి నాకు అవగాహన ఉంది. అందుకే నేరుగా ఇక్కడికే వచ్చి కట్టు కట్టించుకున్నాను. మూడుకట్లు పూర్తయ్యాయి. నొప్పి లేదు. చేయి మామూలు స్థితికి వచ్చింది. ఇక్కడి డాక్టర్ల నైపుణ్యం వెలకట్టలేనిది.

- నా పేరు కే.కన్నభిరామ్. మా ఊరు కాంచీపురం, తమిళనాడు రాష్ట్రం. మోటర్ సైకిల్‌పై వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాను. నా కుడి కాలు తొడ ఎముక విరిగిపోయింది. మూడో కట్టు కట్టుకోవడానికి వచ్చాను. ఈ కట్టుతో నడవగలుగుతానని డాక్టర్లు చెబుతున్నారు. ప్రస్తుతానికి నొప్పి పూర్తిగా తగ్గింది. ఇక్కడ ఫీజు మేము ఇచ్చినంతే తీసుకుంటున్నారు.

మానవుని శరీరం మొత్తం ఎముకల గూడు. ఏ అవయవానికి దెబ్బతగిలినా ఆ వ్యక్తి విలవిల్లాడాల్సిందే. అలాంటిది ఏకంగా ఎముకే విరిగిపోవడం, కీళ్లు తొలగిపోవడం లాంటివి జరిగితే ఆ వ్యక్తి బాధ వర్ణణాతీతం. ఇలా విరిగిన, తొలగిన ఎముకలను ఎలా అతికించాలి, ఎలా సరిచేయాలి, నడవలేని వ్యక్తిని ఎలా నడిపించాలి..? అన్న ప్రశ్నలకు సమాధానం 'పుత్తూరు శల్యంవైద్యం'. నేడు ఆధునిక వైద్య విధానాలు వచ్చినా.. పుత్తూరు కట్టు ముందు అన్నీ తీసికట్టు. ఇది రాజులకు లభించిన వరప్రసాదం. పేద రోగులకు ఆరోగ్యప్రదాయం. వందేళ్లుగా నిరాటంకంగా కొనసాగుతున్న పుత్తూరు శల్యవైద్యంపై 'సాక్షి' ప్రత్యేక కథనం..!

- పుత్తూరు శల్యవైద్యం..రాజులకు లభించిన వరప్రసాదం
- విరిగిన ఎముకలకు మునివేళ్లతోనే వైద్యం
- మూడు కట్లు, మూడు వారాల్లో గాయం మటుమాయం
- 1922 నుంచి కొనసాగుతున్న వైనం
- రాష్ట్రపతులు, ముఖ్యమంత్రులు సైతం పుత్తూరు వైద్యానికి ఫిదా!

సాక్షి, తిరుపతి: పుత్తూరు శల్యవైద్యం దైవానుగ్రహంగా 'రాజు'లకు లభించిన వరప్రసాదం. ఇదే విషయాన్ని సూరపరాజు సుబ్బరాజు వంశస్థులు ఈ వైద్యం పుట్టుక గురించి చెబుతుంటారు. పుత్తూరు మండలం, రాచపాళెంలో 1922లో ఈ వైద్యం పురుడుపోసుకుంది. సూరపరాజు సుబ్బరాజు ఓ రోజు అడవిలో వేటకు వెళ్లి వేటాడిన మాంసపు ముక్కలను చెట్ల ఆకుల్లో చుట్టుకొని ఇంటికి తీసుకొచ్చారు. ఆకుల్లోని ఎముకలు ఒక దానికొకటి అతుక్కొని ఉండడాన్ని గమనించి ఆశ్చర్యపోయారు. అదే ఆకులతో ఎముకలు విరిగిన జంతువులకు కట్టుకట్టడం.. ఆ తర్వాత మనుషులకు కట్టుకట్టడం ప్రారంభించారు. అప్పటి నుంచి నేటి వరకు పుత్తూరు శల్య వైద్యం అప్రహితంగా కొనసాగుతోంది. రాచపాళెం గ్రామం నుంచే నేటికీ ఇదే వైద్య వృత్తిని కొనసాగిస్తున్నారు.

శల్య వైద్య విధానం

ఎక్స్‌రే తీయరు. మత్తు మందు ఇవ్వరు. చేతి మునివేళ్లతోనే ఎముక విరిగిందా లేదా గుర్తిస్తారు. తర్వాత తమ రెండు చేతులతో విరిగిన ఎముకలను సరిచేసి కట్టుకడుతారు. ముందుగా తయారుచేసి పెట్టుకున్న ఆకు పసరుకు కాసింత గుడ్డ, రెండు కోడి గుడ్లు తెల్లసొన, రెండు వెదురు దబ్బలే ఈ వైద్యానికి పరికరాలు. ఎముక విరిగిన, తొలగిన భాగాన దూదిని ఉంచి ఆకు పసరు రాసి గుడ్డ చుడుతారు. ఎముక భాగం కదలకుండా వెదురు దబ్బలను పెట్టి కట్టుకడతారు. ఏడు రోజులకు ఒకసారి వంతున మూడు కట్లు కడతారు. అంతే గాయం నయమవుతుంది.



విరిగిన కాలికి కట్టుకడుతున్న డాక్టర్ ప్రకాష్‌రాజు

పేదలకు పూర్తి ఉచితం



మా పూర్వీకుల నుంచి సంక్రమించిన వైద్యమిది. మాది నాల్గోతరం. మా వైద్యంలో సక్సస్ రేటు 99.9 శాతంగా ఉంది. వందేళ్ల చరిత్రే ఇందుకు నిదర్శనం. పేదలతోపాటు పుత్తూరు వాసులకు పూర్తి ఉచిత వైద్య సేవలందిస్తున్నాం. దూర ప్రాంతాల నుంచి వచ్చే పేద రోగులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నాం. ఆస్పత్రి ఆవరణలోనే 25 గదులను రోగులకు అందుబాటులో ఉంచాం. ఆస్పత్రి సమీపంలోనే టీటీడీ వారిచే మరో 25 గదులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. – డాక్టర్ ఎస్.కృష్ణమరాజు, మేనేజింగ్ డైరెక్టర్, పుత్తూరు శల్యవైద్యశాల

ఇచ్చినంతే ఫీజు

రాచపాళెంలోని ప్రధాన ఆస్పత్రిలో పది రూపాయల రశీదు తీసుకొని లోపలికి వెళితే పది నిమిషాల్లో కట్టు కట్టేస్తారు. తర్వాత రోగి తనకు తోచింది ఇస్తే డాక్టర్ ఫీజుగా తీసుకుంటారు.

పూర్వీకుల వివరాలు

పుత్తూరు శల్యవైద్య వ్యవస్థాపకులు సూరపరాజు సుబ్బరాజు. ఈయనకు నలుగురు తమ్ముళ్లు. వీరిలో ఎస్.మార్కొండేయరాజు, ఎస్.గంగరాజు ఇదే వృత్తిని కొనసాగించారు. ఇంకో ఇద్దరు తమ్ముళ్లు ఎస్.చెంగల్‌రాజు, ఎస్.వెంగమరాజు వైద్య వృత్తికి దూరంగా ఉన్నా, వారి కుమారులైన ఎస్.ప్రకాష్‌రాజు, కన్నయ్యరాజు ఇదే వృత్తిలో కొనసాగారు. గంగరాజు కుమారుడైన ఎస్.కృష్ణమరాజు, మార్కొండేయరాజు కుమారులైన రామరాజు, సుబ్రమణ్యంరాజు ఇదే వృత్తిలో కొనసాగారు. పాత తరంలోని ఎస్.కృష్ణమరాజు, ఎస్.ప్రకాష్‌రాజుతో పాటు సుబ్రమణ్యంరాజు కుమారుడు ఎస్.ప్రతాప్‌రాజు, కన్నయ్యరాజు కుమారుడు ఎస్.బాలసుబ్రమణ్యంరాజు ప్రస్తుతం వైద్య సేవలు అందిస్తున్నారు.



సీఎం ఎన్టీ రామారావుకు కట్టుకడుతున్న డాక్టర్ మార్కొండేయరాజు (ఫైల్)

ప్రముఖులు ఫిదా!

పుత్తూరు శల్యవైద్యం పొంది ఉపసమనం పొందిన వారిలో మాజీ రాష్ట్రపతులు వీవీ.గిరి, నీలం సంజీవరెడ్డి, మాజీ ముఖ్యమంత్రులు టీ.అంజయ్య, నందమూరి తారక రామారావు. కేంద్ర మాజీ మంత్రి కృష్ణంరాజు ఉన్నారు. అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి ఇక్కడికి వచ్చి వైద్యం పొందిన వారు ఉన్నారు. ఇలా వచ్చిన వారు విజిటర్స్ బుక్‌లో తమ వివరాలను పొందుపరచడం విశేషం.



రాష్ట్రపతి వి.వి.గిరికి కట్టుకడుతున్న డాక్టర్ మార్కొండేయరాజు (ఫైల్)

ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు

- మండల పర్యటనలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సోమల: ప్రజల ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం సోమల మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లె నుంచి ప్రారంభమైన మంత్రి పర్యటన వల్లగట్ల పంచాయతీ గల్లావారిపల్లెలో ముగిసింది. పర్యటనలో భాగంగా రూ.2.84 కోట్లతో నిర్మించిన 9 ఆర్వో ప్లాంట్లు, 5 అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, 2 రైతు భరోసా కేంద్రాలు, 3 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, సచివాలయ భవనం, 2 ఓవర్ హెడ్ ట్యాంకులు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ భవనాన్ని ప్రారంభించారు. అలాగే పెద్ద ఉప్పరపల్లె, సోమల, కందుకూరు పంచాయతీల్లో రూ.1.35 కోట్లతో 3 షాదీమహాళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మొత్తం 12 పంచాయతీల్లో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ప్రజలు మహిళలు, యువకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. అనంతరం పాదలగుంటపల్లెలో అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మండల కన్వీనర్ గంగాధరం, పార్టీ మైనారిటీ విభాగం మండల అధ్యక్షుడు మస్తాన్ వలీ, ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్ బాషా, సర్పంచులు విమల, భారతి, జయరాం, వెంకటరమణ, రెడ్డెప్ప, చంద్రకళ, మసూద్, సురేంద్రరెడ్డి, శ్రీదేవి, సౌజన్య, ఎంపీటీసీ సభ్యులు సర్వేశ్వరి, నాగభూషణంరెడ్డి, సావిత్రమ్మ, వేముల హరినాథ, కళ్యాణి పాల్గొన్నారు.

జాతరకు ఆహ్వానం



విజయసాయిరెడ్డితో చర్చిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం(వెంకటగిరి): వెంకటగిరిలో అక్టోబర్ 4, 5 తేదీల్లో జరగనున్న పోలేరమ్మతల్లి జాతరకు విచ్చేయాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం విజయసాయిరెడ్డితో ప్రత్యేకంగా సమీక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెంకటగిరి జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో మరింత వైభవోపేతంగా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. అనంతరం వెంకటగిరి రాజకీయ స్థితిగతులపై సుదీర్ఘంగా చర్చించారు.

ఆరోగ్యం..సురక్షితం

రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా భావించి ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష అమలు చేసింది. ఈ కార్యక్రమంలో ప్రతి ఇంటి తలుపు తట్టి.. రోగులను గుర్తిస్తోంది. పల్లె ముంగిటే వైద్యశిబిరంలో ఏర్పాటు చేసి.. నిపుణులతో ఆ సమీప పీహెచ్‌సీలోనే అన్ని వైద్యసేవలు అందించనుంది. ఫలితంగా పేదలకు ఆరోగ్యానందం కలగనుంది.

- వేగంగా సాగుతున్న ఆరోగ్య సురక్ష సర్వే
- ఇంటింటా వలంటీర్లు, వైద్యబృందం
- క్షేత్రస్థాయిలో ఏడు రకాల పరీక్షలు
- నేటి నుంచి జిల్లాలో మెగా హెల్త్ క్యాంపులు



తిరుపతిలో సర్వేను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీహరి (ఫైల్)

చిత్తూరు రూరల్: మాయరోగాలను ఆదిలోనే మట్టుబెట్టి.. నిరుపేదకు ఆరోగ్యభాగ్యం చేకూర్చాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇంటింటా సర్వేను చేస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 13.13 లక్షల కుటుంబాలు ఉండగా..సుమారు 32.50 లక్షల మంది జనాభా ఉన్నారు. ఈ కుటుంబాల్లో అందరికీ పరీక్షలు చేయనున్నారు.

చురుగ్గా ఇంటింటి సర్వే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈనెల 15వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే వేగవంతంగా సాగుతోంది. తొలి దశ ఇంటింటి సర్వేని 21,417 మంది వలంటీర్లు ప్రారంభించగా..రెండో దశగా 1,333 మంది ఏఎన్‌ఎంలు, 902 మంది మిడెలెవల్ హెల్త్ ప్రొవైడర్లు సర్వే ప్రక్రియ చేపట్టారు. వీరంతా అనారోగ్య లక్షణాలున్న వారికి వారి ఇంటి వద్దే ఏడు రకాల పరీక్షలు చేస్తున్నారు. పరీక్షల ఆధారంగా మెగా వైద్య శిబిరానికి రావాలని టోకన్లు ఇస్తున్నారు.

పరీక్ష వివరాలిలా..

ఇప్పటివరకు వలంటీర్లు 5,91,662 కుటుంబాలు, వైద్య బృందం 487621 కుటుంబాల తలుపుతట్టారు. ఈ కుటుంబాల్లోని 14,87,420 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 7,66,595 మందికి బీపీ, 6,64,997 మందికి మధుమేహం, 7,15,023 మందికి హెచ్‌బీ, 9,189 మంది యూరియన్, 3,518 మందికి మలేరియా, 7,463 మందికి డెంగీ, 7,333 స్పుటమ్ పరీక్షలు చేశారు. కాగా ఇప్పటివరకు 25 వేల మందికి టోకన్లు అందజేశారు. వీరందరినీ మెగా హెల్త్ క్యాంపునకు రావాలని సూచిస్తున్నారు.

నేటి నుంచి మెగా హెల్త్ క్యాంపు

జిల్లాలో ఈనెల 30వ తేదీ నుంచి మెగా వైద్యశిబిరాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా ముందస్తుగానే రాష్ట్ర ప్రభుత్వం ట్రయల్ రన్ చేపట్టింది. పైలెట్ ప్రాజెక్టు కింద చిత్తూరు జిల్లా బంగారుపాళెం మండలం తుంబకుప్పం పీహెచ్‌సీ పరిధిలోని తిమోజీపల్లె ప్రాథమిక పాఠశాలలో, తిరుపతి రూరల్‌లోని దామినేడు పీహెచ్‌సీ, మల్లవరం పీహెచ్‌సీలో హెల్త్ క్యాంపు నిర్వహించి ట్రయల్ చూశారు. శనివారం నుంచి ప్రారంభం కానున్న మెగా హెల్త్ క్యాంపు సంసిద్ధమయ్యారు. శనివారం తిరుపతి జిల్లాలో 17 ప్రాంతాలు, చిత్తూరు జిల్లాలో 32 ప్రాంతాల్లో మెగా హెల్త్ క్యాంపుల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

వైద్యం బహుబాగుగా..



ఇంటి వద్దే పరీక్షలు చేసి, చికిత్స అందించే రోజులు వచ్చాయి. జగనన్న ఆరోగ్య సురక్ష ముఖ్య ఉద్దేశం కూడా అదే. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. వైద్య సిబ్బంది కూడా బాధ్యతతో చేయాలి.

– డాక్టర్ శ్రీహరి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, తిరుపతి

అటవీ అధికారులపై దాడి ఘటనలో ముగ్గురిపై కేసు



ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ లోకేష్

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : అటవీశాఖ అధికారులపై దాడి చేసిన సంఘటనలో ముగ్గురు ప్రైవేటు ఫ్యాక్టరీ సిబ్బందిపై కేసు నమోదు చేసినట్లు ఫారెస్టు రేంజ్ అధికారి లోకేష్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ శ్రీకాళహస్తి రేంజ్ పరిధిలోని కేవీబీపురం మండలం, తిమ్మసముద్రం గ్రామ సమీపంలో ఉన్న ప్రైవేటు ఫ్యాక్టరీ యాజమాన్యం, సిబ్బంది గురువారం పాత భవనాల శిథిలాలను ఆదవరం రిజర్వ్ అడవిలోకి తోలుతుండగా రాగిగుంట డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్ వారిని అడ్డుకున్నారన్నారు. ఈ క్రమంలో ఫ్యాక్టరీ యాజమాన్య సిబ్బంది ఫారెస్ట్ అధికారులపై రాళ్లతో దాడికి యత్నించారని తెలిపారు. పారిపోయిన ఇద్దరు నిందితులు శుక్రవారం పెద్దల సమక్షంలో ఫారెస్ట్ రేంజి ఆఫీసర్ ఎదుట లొంగిపోయారని వెల్లడించారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

పిచ్చాటూరు: ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం పిచ్చాటూరు మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. కేవీబీపురం మండలం, పాతపాళెంకు చెందిన అయ్యప్ప(45), దొరవేలు శ్రీకాళహస్తి నుంచి పిచ్చాటూరుకు ట్రాక్టర్‌లో రేకుల లోడ్డుతో వెళ్తున్నారు. దొరవేలు ట్రాక్టర్ తోలుతుండగా పక్కన అయ్యప్ప కూర్చొని ఉన్నాడు. పిచ్చాటూరు మండలం, గొల్లకండ్రిగ సమీపంలో గాలీవానకు వెనుక ఉన్న రేకు అయ్యప్ప తలకు తగలడంతో అతను ట్రాక్టరు కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వాహనదారులకు ఇంధనం

అట్టహాసంగా వైఎస్సార్ వాహన మిత్ర పథకం

- జిల్లాలో 11,864 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.11,86,40,000 జమ
- ఆటో నడిపిన మంత్రి ఆర్కే రోజా
- ఈ పథకం మాకో వరం : లబ్ధిదారులు



మెగా చెక్కును అందజేస్తున్న టూరిజంశాఖ మంత్రి ఆర్కే.రోజా, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జేసీ డీకే.బాలాజీ

తిరుపతి అర్బన్: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని మంత్రి ఆర్కే. రోజా తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వైఎస్సార్ వాహనమిత్ర ఐదో విడత కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా విజయవాడ నుంచి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించగా.. ఆయన ప్రసంగాన్ని స్థానిక ఆటో లబ్ధిదారులు వర్చువల్ పద్ధతిలో వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరుసగా ఐదో విడత వైఎస్సార్ వాహన మిత్ర పథకం అందజేయడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో ఐదు విడతల ద్వారా రూ.1,301 కోట్లను వాహనదారులకు జమచేసినట్టు వెల్లడించారు. జేసీ డీకే.బాలాజీ మాట్లాడుతూ వాహన ఇన్సూరెన్స్, రిపేర్ ఖర్చుల నిమిత్తం ఏడాదికి పదివేల రూపాయల ఆర్థిక సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. తిరుపతి జిల్లాలో మొత్తం 11,864 మందిని ఈ పథకానికి అర్హులుగా గుర్తించి వారి ఖాతాల్లోకి రూ.11,86,40,000 జమ చేసినట్టు వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. అనంతరం మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. పలువురు ఆటోవాలాలు మంత్రితో సెల్ఫీలు దిగేందుకు ఆసక్తిచూపారు. రవాణాశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ బసిరెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి సీతారామిరెడ్డి, గూడూరు ఆర్టీఓ ఆదినారాయణ, తిరుపతి డివిజన్ ఎంవీఐలు కుసుమ, శ్రీనివాసరావు, సుబ్రమణ్యం, పుత్తూరు చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఆటో నడుపుతున్న మంత్రి ఆర్కే.రోజా

వాహన మిత్ర ఓ వరం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ వాహన మిత్ర పథకం మాకు ఓ వరం. ఏ నాయకుడూ మమ్మల్ని గుర్తించలేదు. అయితే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సరైన గౌరవాన్ని ఇచ్చారు. ఏడాదికి రూ.10 ఇస్తున్నారు. సీఎం సర్‌కు రుణపడి ఉంటాం.

– దొరసాని, ఆటో డ్రైవర్

సీఎంకు రుణపడి ఉంటాం



మహిళలు కూడా ఆటో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నారు. ఇలాంటి తరుణంలో వరుసగా ఐదో విడత వాహన మిత్ర పథకం ద్వారా రూ.10వేలు ఇవ్వడం ఎంతో ప్రయోజనంగా భావిస్తున్నాం. సీఎంకు రుణపడి ఉంటాం.

–వాణి, ఆటో డ్రైవర్

సన్నజీవాల అభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న ప్రకాష్ యాదవ్

తిరుపతి సిటీ: గ్రామీణ స్థాయిలో సన్నజాతి పశుపోషణే ధ్యేయం కావాలని రాష్ట్ర గొర్రెల సహకార సంఘం అధ్యక్షులు ప్రకాష్‌యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఆడిటోరియంలో జిల్లా పశు సంవర్థకశాఖ ఆధ్వర్యంలో రైతులకు సన్నజీవాల అభివృద్ధి అనే అంశం పై ఒక రోజు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ పౌల్ట్రీ, గొర్రెలు, మేకలు, పందుల పెంపకం వంటి వాటిపై రైతులు, శాస్త్రవేత్తలు అవగాహన కలిగి ఉండాలన్నారు. సన్న జీవాల పెంపకానికి ప్రభుత్వం కోటి రూపాయల వరకు కేటాయిస్తోందని, ఇందులో 50 శాతం వరకు సబ్సిడీ సభిస్తుందని తెలిపారు. పశుగణాభివృద్ధి సంస్థ అధ్యక్షులు సంతోస్‌కుమార్, పశువైద్య శాఖాధికారులు, సైంటిస్టులు, రైతులు పాల్గొన్నారు.

చర్చించుకుందాం రండి!

- 1న చంద్రగిరి క్యాడర్‌తో ఆత్మీయ సమావేశం
- ఒక రోజంతా సరదాగా కలిసి గడుపుదాం
- గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి పనిచేద్దాం
- మండల స్థాయి ముఖ్యనేతలతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్: 'చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి ఎన్నో రకాలుగా కష్టపడ్డాం. రెండు పర్యాయాలు పార్టీ అభ్యర్థిగా గెలిపించినందుకు కృతజ్ఞతలు. ప్రజలు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కోసం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ప్రతిపల్లెలో ప్రగతి పనులు పరుగులు పెట్టించాను. కులం, మతం, ప్రాంతం, పార్టీ అన్న తేడాలు లేకుండా అందరికీ సంక్షేమ పథకాలు చేరువచేశాను. ఆరోగ్యంలోనూ, ఆపదలోనూ, పండుగలోనూ, విపత్తులోనూ అందరికీ అండగా నిలబడ్డాను. ముఖ్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇచ్చిన సహకారంతోనే ఇదంతా చేయగలిగాను. ప్రజలకు మంచి చేయాలనే తపనతో పార్టీ నాయకులు, కార్యకర్తలకు కొంతదూరమై ఉండవచ్చు.. అందుకే మనమంతా ఒక కుటుంబ సభ్యులుగా ఒక రోజంతా కలసి మెలసి సరదాగా గడపాలని నిర్ణయించుకున్నా. అక్టోబర్ 1న చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామ స్థాయి నుంచి మండలం వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు అందరూ ఒక వేదికపైకి తీసుకురావాలనే ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశాం. గ్రామ స్థాయి నుంచి ప్రతి కార్యకర్త ఈ సమావేశానికి హాజరయ్యేలా నాయకులు చొరవ చూపాలి' అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. తిరుపతి రూరల్ మండలం, తనపల్లిలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో శుక్రవారం నియోజకవర్గం పరిధిలోని పార్టీ నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపల్లిలోని రామానాయుడు కల్యాణ మండపంలో అక్టోబర్ 1వ తేదీ ఆదివారం ఉదయం 7 నుంచి రాత్రి 10గంటల వరకు చంద్రగిరి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ క్యాడర్‌తో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు రకరకాల వంటకాలతో భోజనం తయారు చేయించి విందు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామ స్థాయిలో పార్టీ పటిష్టం చేయడానికి అనుసరించే వ్యూహాలపై చర్చించుకుని కష్ట, సుఖాలను పంచుకునేందుకు ప్రతి ఒక్కరూ తరలి రావాలని కోరారు. ఆరు మండలాల్లోని ఆయా డివిజన్ల పార్టీ అధ్యక్షులు రవాణా ఏర్పాట్లు చేయాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా చంద్రగిరి నియోజకవర్గంలో రూ.954 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని, అలాగే సంక్షేమం, సేవా కార్యక్రమాలు కూడా పెద్ద ఎత్తున చేసినట్టు వెల్లడించారు. సమావేశంలో ఆరు మండలాల సీనియర్ నేతలు, డివిజన్ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



పూజాద్రవ్యాలు తీసుకెళ్తున్న అర్చకులు, ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు శుక్రవారం ముగిశాయి. మూలవిరాట్‌లకు పవిత్ర మాలలను సమర్పించి విశేష పూజలు నిర్వహించారు. ఆయ ప్రధాన అర్చకులు స్వామినాథన్ గురుకుల్ ఆధ్వర్యంలో విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. పవిత్ర మాలలను ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితుల ఆధ్వర్యంలో ఊరేగింపుగా తీసుకెళ్లి తొలుత రంగుల గోపురం వద్ద ఉన్న వినాయకునికి సమర్పించారు. తర్వాత ఆలయంలోని పరివార దేవతలకు సమర్పించారు. వినాయకుడు, జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి కూడా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగశాలలో విశిష్ట పూజాద్రవ్యాలతో శాంతి హోమం పూజలు పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ సాగర్‌బాబు, పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడిన కార్లు, స్మగ్లర్లతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి మంగళం: వైఎస్సార్ జిల్లా, కాజీపేట మండలం వద్ద రెండు కార్లలో లోడ్ చేస్తున్న 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ముగ్గురు స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్టు టాస్క్ ఫోర్సు పోలీసులు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ జీ.చెంచుబాబు ఆధ్వర్యంలో ఆర్ఐ చిరంజీవి, ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం రెండు రోజులుగా ఖాజీపేట, బద్వేలు వైపు వెళ్తున్న వాహనాలను తనిఖీ చేస్తోంది. పత్తూరు సమాధుల వద్ద రెండు కార్లు అనుమానాస్పదంగా కనిపించాయి. దాంతో వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా టాస్క్‌ఫోర్స్ పోలీసులను చూసి కొందరు పారిపోగా.. ముగ్గురి ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒ కరు కానిస్టేబుల్ ప్రసాద్‌ను గాయపరిచాడు. పట్టుబడిన వారు తమిళనాడు తిరుపత్తూరు జిల్లాకు చెందిన సుందరవేల్ కుప్పన్(30), పార్తీబన్ మురుగన్ (30), కృష్ణగిరి జిల్లా రమేశ్ మునియప్ప (43)గా గుర్తించినట్టు డీఎస్పీ తెలిపారు. ఎర్రచందనాన్ని తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఫోర్డు కారు (ఏపీవై01బీఎం4846), రినాల్ట్ డస్టర్ (టీఎన్20సీడీ 5656) కార్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఎస్ఐ మోహన్‌నాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

ఆత్మీయత పంచుతూ.. పూల వర్షం కురిపిస్తూ!



తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

- గడప గడపకు మహాపాదయాత్రకు విశేష స్పందన

పాకాల: మండలంలోని ఉప్పరపల్లి పంచాయతీలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేపట్టిన రెండో రోజు గడప గడపకు మహా పాదయాత్రకు విశేష ఆదరణ లభించింది. పంచాయతీలోని తువ్వచేను కొత్తవడ్డిపల్లి గ్రామానికి శుక్రవారం ఉదయం చేరుకున్న ఆయనకు అపూర్వ స్వాగతం లభించింది. పూల వర్షం కురిపిస్తూ, బాణసంచా పేల్చుతూ పార్టీ శ్రేణులు తమ అభిమానాన్ని చాటుకున్నారు. తువ్వచేను కొత్తవడ్డిపల్లి, పోలవరపు ఇండ్లు, నల్లగుట్టఇండ్లు, అబ్బానాయుడు ఇండ్లు, మేడసానిఇండ్లు, రామిరెడ్డిగారిఇండ్లు, నన్నూరివారిపల్లి ఊట్లవారిపల్లి గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు.

ప్రజలతో మమేకమై..

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రజలతో మమేకమయ్యారు. ప్రతీ గడపలో ప్రభుత్వం అందజేసిన పథకాల వివరాలను తెలుపుతూ సంక్షేమ బుక్‌లెట్‌ను అందజేశారు. తువ్వచేను గ్రామంలో డిసెంబర్ నాటికి ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

తువ్వచేను కొత్తవడ్డిపల్లికి చెందిన టీడీపీ కార్యకర్తలు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో కె.గోపి, ఎం.కేశవ, శ్రీనివాసులు, మహేష్, నరేష్ ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు ఉన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్.జయదేవ్‌నాయుడు, ఎంపీపీ లోకనాథం, కన్వీనర్ నరేష్‌రెడ్డి, సర్పంచ్ గౌరీశంకర్‌రాజు, ఎంపీటీసీలు సురేష్, శ్యామల, రఘుపతి, బాబురెడ్డి, మధు, మునిరత్నంరెడ్డి, భాస్కర్‌నాయుడు, అన్నబాబు, రమేష్, నాగూర్ బాషా, శివకుమార్, మోహన్, పరదేశి, మస్తాన్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.